


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

ఆదివారం | 01 జూన్ 2025

పేజీలు 8


ఆరోగ్యం,ఆధ్యాత్మిక సాధనకు

## యోగ ప్రధాన ప్రక్రియ

- ప్రతి ఒక్కరూ యోగ క్రియలను అనుసరించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
- శ్రీశైలంలో 1500 మందితో యోగాంధ్ర కార్యక్రమం



యోగాసనాలు వేయిస్తున్న నంద్యాల కలెక్టర్ రాజకుమారి

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు.శనివారం శ్రీశైల మహాక్షేత్రంలోని గంగాధరమండపం నుండి నంది సర్కిల్ వరకు 1500 మందిచే నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్ జి.రాజకుమారి,శ్రీశైల నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి,

మిగతా 2లో

# రాష్ట్రమంతా అభివృద్ధి ఫలాలు



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్

- ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఎంఎస్ఎంఇ పార్కులు
- అన్నీ చోట్లా పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం..
- 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తాం
- సీఎం చంద్రబాబు పనితీరు పై దేశమంతటా ప్రశంసలు
- వైకాపా ప్రభుత్వ పనితీరుతోనే అధోగతిలోకి రాష్ట్రం
- కర్నూలును స్మార్ట్ సిటీగా మారుస్తాం..
- జూన్21న గ్రీన్‌కో ప్రారంభోత్సవానికి రానున్న ప్రధాని మోదీ
- జైరాజ్ ఇస్పాత్‌కు త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు
- ఇప్పటికే 72 ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- కర్నూలుకు హైకోర్టు బెంచ్ వస్తుంది..
- లోకాయుక్త, మానవహక్కుల కమిషన్లు ఇక్కడే ఉంటాయి..
- రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ.భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** రాష్ట్రమంతటా అభివృద్ధి పరుగులు తీయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టి.జి.భరత్ చెప్పారు. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలిపారు. ఫలితంగా రాష్ట్రమంతటా పరిశ్రమలు వస్తాయని, ఇది చంద్రబాబు విజన్ అని భరత్ అన్నారు. శనివారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది పూర్తి కావస్తున్న నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పని తీరుపై ప్రశంసల వర్షం కురిపిస్తూ కొనియాడిన భరత్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పని తీరుపై నిప్పులు చెరిగారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెదేపాతో తన అనుబంధం మరింత బలపడిందన్నది తన ఆహార్యంతోనే చెప్పే ప్రయత్నం చేస్తున్న భరత్ ఆ వైపుగా అందరినీ ఆకట్టుకుంటున్నారు. తెలుపు, పసుపు మిళితమైన చొక్కాపై తెదేపా సైకిల్ గుర్తుతో పాటు టీజీ అనే పేరుతో ఎంబ్రాయిడరీ చేసిన ప్రత్యేకమైన చొక్కాను ఆయన ఇప్పుడు ధరిస్తున్నారు. కొంత కాలంగా దీనిపై ఆయన అభిమానుల్లోనూ చర్చ జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. చంద్రబాబునాయుడు నాయకత్వంపై భరత్ అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. ఎక్కడ అవకాశం వచ్చినా చంద్రబాబు ముందు చూపుపై పొగడ్తల వర్షం కురిపిస్తూ నారా లోకేష్ పని తీరును మెచ్చుకుంటున్న భరత్ అధిష్టానం మెప్పునూ పొందుతున్నారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన భరత్‌కు మంత్రిగా కూడా వెంటనే అవకాశం వెదుక్కుంటూ వచ్చింది. యువకులకు మంత్రివర్గంలో ప్రాధాన్యమివ్వాలన్న అధిష్టానం ఆలోచనలో భాగంగా భరత్‌కు ఆ పదవి దక్కింది.రాష్ట్రాన్నిపారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న అజెండాతో ముందుకు వెళుతున్న ముఖ్యమంత్రి

మిగతా 4లో

## పింఛన్ల కోసం రూ.వేల కోట్లు

- దేశంలో ఏపిలోనే అత్యధికం
- నేడు ఆదివారం కావడంతో ఒకరోజు ముందే పింఛన్లు
- పింఛన్ల పంపిణీలో పాల్గొన్న మంత్రి టీజీ.భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** పేదలకు అండగా నిలిచేందుకు పింఛన్ల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ చెప్పారు. శనివారం కర్నూలు నగరంలోని 48వ వార్డు పరిధిలోని అమీర్‌హైదర్ నగర్‌లో కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి మంత్రి పింఛన్ల పంపిణీలో పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్ద ఎత్తున ఇస్తున్నామని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 11 నెలలుగా

మిగతా 2లో



పింఛన్ పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి టీజీ.భరత్

ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో లబ్ధిదారుల కళ్ళల్లో

## ఆనందం చూశా..

- రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్



ఎన్టీఆర్ భరోసా పించన్లను పంపిణీ చేస్తున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు ఆసరాగా నిలిచిందని వారి కళ్ళల్లో ఆనందం చూశానని రూ.200ల నుంచి రూ. 2వేల వరకు పింఛన్‌ను పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కిందని రాష్ట్రన్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కితాబునిచ్చారు. 1వ తేది ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం 10వ వార్డు నశ్యం వీధిలో బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందునాయుడు ఆధ్వర్యంలో

మిగతా 2లో

శ్రీశైలం జలాశయానికి

## కొనసాగుతున్న వరద నీరు



2లో

శ్రీశైలం జలాశయంలో నీరు వచ్చి చేరుతున్న దృశ్యం

## ఐపిఎల్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్టు

- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

6లో




బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టును చూపిస్తూ మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

# పింఛన్ల కోసం రూ. వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)


పింఛన్ పంపిణీ చేసిన కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా

ఎలాంటి ఆటంకం లేకుండా పింఛన్లు ఇస్తున్నామని ఆయన తెలిపారు. అమీర్ హైదర్ నగర్‌లో మౌళిక వసతుల కల్పన కోసం 1.54 కోట్ల రూపాయలు కేటాయించామని ఆయన చెప్పారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక పింఛన్లు మన రాష్ట్రంలోనే ఇస్తున్నారని చెప్పారు. నగరంలో పింఛన్ల కోసం ప్రతి నెలా సుమారు 36వేల మందికి 16 కోట్ల రూపాయలు ఇస్తున్నామని ఆయన చెప్పారు.

**2.37 లక్షల మందికి పింఛన్లు :** కర్నూలు జిల్లాలో 2,37,200 మందికి సామాజిక పింఛన్లు ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చెప్పారు. శనివారం ఆయన కర్నూలు నగరంలోని దేవనగర్‌లో పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. పింఛన్ల కోసం జిల్లాలో 103.35 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీ పింఛన్లు ఇవ్వాల్సి ఉన్నా ఆదివారం కావడంతో శనివారమే అందిస్తున్నామని ఆయన చెప్పారు. పింఛన్ తీసుకుంటూ అక స్మాత్తుగా భార్య లేదా భర్త చనిపోతే జీవించి ఉన్న వారికి పింఛన్ ఇవ్వాలని తాను ముఖ్యమంత్రి వద్ద ప్రతిపాదిస్తే దాన్ని అమలు చేశారని ఆయన చెప్పారు. 2023 డిసెంబర్ 1వ తేదీ నుండి 2024 నవంబర్ 31వ తేదీ మధ్య భర్త మరణించిన మహిళలకు వితంతు పింఛన్లు మంజూరు చేశామని, కర్నూలు జిల్లాలో 2319 మందికి జూన్ 12వ తేదీన పింఛన్లు పంపిణీ చేయనున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూశా

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులకు స్వయంగా ఇంటింటికి వెళ్లి పింఛన్‌ను మంత్రి ఫరూక్ అందజేశారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపించిందన్నారు. గత ప్రభుత్వంలో రూ.2వేల పెన్షన్‌ను రూ.3వేలు పెంచుతూ ఐదేళ్ళు కాలం గడిపిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని ఏటా రూ.250లు పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారని టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే అధినేత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం రూ.3వేల నుంచి రూ.4వేలు పెంచుతూ అదే విధంగా మూడు నెలల ముందే ప్రతినెల వెయ్యి చొప్పున మొత్తం కలిపి రూ.7వేలు అధికారం చేపట్టిన మొదటి నెలలోనే పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో మే 31వ తేదీన పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో నంద్యాల ఇన్‌చార్జి కమిషనర్ వెంకటదాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి షేక్ మున్నా, 15వ వార్డు టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు అజ్మీర్, మిద్దె హుసేన్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద నీరు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలసానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది.శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 31, 162 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.అందులో జూరాల ప్రాజెక్టు నుండి 26,817 క్యూసెక్కులు,సుంకేసుల నుండి 4,345 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా డ్యామ్ నీటిమట్టం 828.20 అడుగులకు చేరుకుంది. గడిచి న 24 గంటల వ్యవధిలో జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా కుడిగ ట్టు జల విద్యుత్ కేంద్రంలో 638 క్యూసెక్కులన్నిటిని వినియోగిం చుకొని 0.291 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి,తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 1,095 క్యూసెక్కుల నీటిని ఉపయోగించు కొని 0.484 మిలియన్ యూని ట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.అలాగే మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 416 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా నీటి ఆవిరి రూపంలో 161 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 47.7648 టీఎంసీలనీరు నిల్వగా నమోదైంది.అయితే ఏడాది మే నెలలోనే శ్రీశైలానికి వరద ప్రవాహం ప్రారంభం కావటం విశేషం.

# శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠలో మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని శనివారంనాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు పెట్టుబడులు మౌళిక సదుపాయాల మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. వారు ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వారికి స్వాగతం పలికారు. స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ ఆలయ నిర్మాణానికి మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి దంపతులు రూ.10లక్షల రూపాయల విరాళాన్ని అందజేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.



# అధికారులు అప్రమత్తం కావాలి


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** వర్షాకాలం మొదలైందని ఇరిగేషన్, పంచాయతీ, గ్రామీణ, నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, తహాశీల్దార్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ యోగాంధ్ర, హౌసింగ్, రెవెన్యూ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి నవ్య, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం

**బనగానపల్లెరూరల్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాలి బాల గంగాధర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారంనాడు పాఠశాల నందు చేపట్టారు. గాలి బాల గంగాధర్ రెడ్డి ఎన్ని సవాళ్లు ఎదురైన స్వీకరించి విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడంలో తనదైన పాత్రను పోషించారని గత రెండు సంవత్సరాల క్రితం బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చి తక్కువ సమయంలోనే విద్యార్థుల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్నారని పదవీ విరమణ తరువాత వారి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శాల్వ కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.



# ఆరోగ్యం,ఆధ్యాత్మిక సాధనకు యోగా ప్రధాన ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు.ప్రముఖ యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమములో యోగాను చేయించారు.ప్రముఖ సంస్కృత పండితులు డా.దీవి హయగ్రీవాచార్యుల వారు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.సంప్రదాయ నృత్యంతో యోగా కార్యక్రమం నిర్వహించబడింది.చిరంజివి గంధవళ్ళ రాధా రమణి గణపతి ప్రార్ధన,సరస్వతి ప్రార్థన, శివస్తోత్రాలకు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21 నుంచి జూన్ 21 వ తేదీ వరకు నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలలోని అయిదు పర్యాటక ప్రదేశాలలో యోగ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిన మేరకు శనివారం ఇల కైలాస సన్నిధిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 1500 మందితో యోగ నిర్వహించుకున్నామన్నారు. 2014లో ఐక్యరాజసమితి భారతదేశంలో పుట్టిన యోగాను జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగాదినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటి వరకు 170 దేశాలలో


యోగాసనాలు వేస్తున్న దృశ్యం

యోగ ప్రక్రియలను అవలంభిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరిజీవితంలో యోగా దినచర్యలో భాగమై ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు చిహ్నం కావాలని ఆకాంక్షించారు.జిల్లాలో ఈశాన్య భాగమైన శ్రీశైల మహా క్షేత్రంలో మొట్టమొదటి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఆరోగ్యకరమైన జీవితం, సుఖ సంతోషాలు, బాధల నుండి విముక్తి,మానసిక ప్రశాంతత మొదలైనవన్నీ యోగసాధన ద్వారా పొందవచ్చునని తెలిపారు. యోగా వలన శారీరకంగా, మానసికంగా,ఆధ్యాత్మికంగా ఎన్నో మంచిఫలితాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈనెల 16వ తేదీన నంద్యాల పట్టణంలో దాదాపు 10 వేల మంది ఉద్యోగులు, సిబ్బందిచే యోగాసనాలు అభ్యసించేందుకు సిద్ధం చేస్తున్నామని ,75 సంవత్సరాలు నిండిన వృద్ధులకు కూడా మూడు ప్రదేశాలలో యోగాసనాలు చేయించేందుకు కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని జూన్ 21వ తేదీన దాదాపు 8 లక్షల మందితో యోగ కార్యక్రమంలో భాగస్వాములు చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.అనంతరం శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నెలరోజులపాటు యోగ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు శ్రీశైల క్షేత్రంలో యోగ కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో నిర్వహించే యోగా ప్రక్రియను అనుసరించాలని సూచించారు.జూన్ 21వ తేదీ నిర్వహించే అంతర్జాతీయ యోగాదినోత్సవానికి జిల్లా తరుపున అత్యధిక మంది యోగాభ్యసనాలు చేసేందుకు అన్నిస్థాయిల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు.ఈ మెగా యోగాంధ్ర కార్యక్రమములో పాల్గొన సాధకులకు అభినందించారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం,స్థానిక శాసనసభ్యులు పర్యాటక ప్రదేశాలలో మొదటి యోగ కార్యక్రమాన్ని శ్రీశైలదేవస్థానములో నిర్వహించడానికి అవకాశం కల్పించడం ఎంతో సంతోషదాయకమన్నారు.యోగా అనేది మన సంస్కృతిలో అనాదిగా ఆచరణలో ఉందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయన్నారు. శాసన సభ్యులు సూచించినట్లుగా దేవస్థానం తరుపున యోగా శిక్షకులను ఏర్పాటు చేసి ప్రతీరోజు కూడా సిబ్బందికి, స్థానికులకు మరియు యాత్రికులకు యోగాపై శిక్షణను నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా యోగా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. చివరిగా యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం ప్రతి ఆసనానికి వివరణ ఇస్తూ యోగాపరమైన అంశాలను ఆధునిక వైద్య విజ్ఞానంతో అనుసంధానం చేస్తూ ఆయా విశేషాలను,యోగావలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అభ్యాసకులచే యోగాసనాలు చేయించారు. శారీరక ఆసనాలు, శ్వాసపై ధ్యాస,ధ్యానం, ప్రాణాయామం మొదలైనవన్నీ యోగాలోని ప్రధాన క్రియలు అని తెలిపారు.కార్యక్రమములో సూక్ష్మవ్యాయమం, వృక్షాసనము, వక్రాసనము,ఉత్తాన పాదాసనము, పవనముక్తాసనము, అర్థహలాసనము,శలభాసనము, పాదహస్తానము,దండాసనము మొదలైన ఆసనాలను వేయించారు. కపాలభాతి, అనులోమ విలోమ,శీతలి,భ్రామరి మొదలైన విధానాలతో ప్రాణాయామం చేయించారు. చివరగా శాంతిమంత్రాలతో ఈ యోగా కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమములో పలువురు జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులు,సిబ్బంది, శివసేవకులు,స్థానిక చెంచు గిరిజనులు,యాత్రికులుతదితరులు పాల్గొన్నారు.

# వెనుపోటు పోస్టర్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా

- రాష్ట్ర యవజన విభాగం సెక్రెటరీగా విజయ్‌చౌదరి
- నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులుగా శివశంకర్ నాయక్
- మండల ఎస్టీ సెల్ సెక్రెటరీగా వెంకటేష్ నాయక్
- పట్టణ మహిళ విభాగం అధ్యక్షులుగా దర్గమ్మ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే వెన్ను పోటు పోస్టర్‌ను మాజి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి విడుదల చేశారు. శనివారం వైఎస్సార్‌సిపి కార్యాలయంలో శిల్పా నాయకులు, కార్యకర్తలతో కలిసి వెన్ను పోటు కార్యక్రమంపై చర్చించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ మాజి ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు ఈనెల 4వ తేది నుంచి వెన్ను పోటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇదిలా ఉంటే జగన్ ఆదేశాల మేరకు



**మాజి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న శివశంకర్ నాయక్**

శిల్పా చక్రపాణి రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం సెక్రేటరిగా కౌన్సిలర్ విజయ్‌చౌదరి, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులుగా శివశంకర్ నాయక్, మండల ఎస్టీ సెల్ సెక్రేటరిగా వెంకటేష్ నాయక్, పట్టణ మహిళ విభాగం అధ్యక్షలుగా దరగమ్మ నియమించడంతో మాజి ఎమ్మెల్యే శిల్పాను మర్యాదపూర్వకంగా కలిసి ప్రతే క కృతజ్ఞతలు తెలిపారు.

# 9వ ఆంధ్ర గర్ల్స్ ఎన్‌సిసి బెటాలియన్ శిక్షణా శిబిరం ప్రారంభం



**ఎన్‌సిసి బెటాలియన్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంంద్యాలలోని శ్రీరామకృష్ణ అటానమస్ డిగ్రీ పీజీ కళాశాలలో 9వ ఆంధ్ర గ ర్ల్స్ బెటాలియన్ కర్నూలు ఆధ్వర్యంలో పది రోజులు మే 29వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు బాలికల ఎన్‌సిసి శిక్షణా శిబిరాన్ని కర్నూలు గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి లాంఛనంగా ప్రారంభించారు. క్యాంప్ కమాండెంట్‌గా కర్నూలు బాలికల ఎన్‌సిసి బెటాలియన్ కమాండర్ జోబి ఫిలిప్ వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా త్రిపాటి మాట్లాడుతూ శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో 10రోజుల క్యాంపు నిర్వహణకు అన్ని సదుపాయాలు ఉండడం వల్ల క్యాంపు నిర్వహణకు సంస్థ అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి సానుకూల దృకృథంతో ఇక్కడ క్యాంపును నిర్వహిస్తూ ఉన్నామన్నారు. పదిరోజుల శిక్షణ శిబిరంలో ఎన్‌సిసి క్యాడెట్స్ అనేక విషయాలు నేర్చుకుంటారని డ్రిల్లు, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజిన్, యోగా గెస్ట్ లెక్చరర్స్, తదితర అంశాలు ఉంటాయన్నారు. ఈ అంశాలలో క్యాడెట్స్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణ కలిగి ఉండాలంటే 2047 వాటికి వికసిత భారత్ నిర్మాణం జరగాలన్నారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ జోబి ఫిలిప్ మాట్లాడుతూ పది రోజుల శిక్షణా శిబిరంలో ఎన్‌సిసి క్యాడెట్స్ ఎన్నో విషయాలను నేర్చుకుంటారని ఆర్మీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహిస్తూ ఉన్నామన్నారు. డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సిసి శిబిరానికి దాదాపుగా 600మంది రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గౌరవ అభినందన అవార్డును అలోక్ త్రిపాటి చేతుల మీదుగా రామకృష్ణారెడ్డికి ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు డాక్టర్ లలితాసరస్వతి, కమల్‌ఖాన్, లక్ష్మీ దుర్గ, గీతాంజలి, రూల్ శ్రీదేవి, భువనచంద్ర, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు వృద్ధులకు అండ..

**ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి**



**లబ్ధిదారులకు పించన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వృద్ధులకు, వికలాంగులకు, ప్రతిభావంతులు, వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు ఎన్‌టిఆర్ భరోసా ద్వారా ప్రభుత్వం అందించే పింఛన్లు వారికి ఎంతగానో ఆర్థిక భరోసాను కల్పిస్తుందని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌లను ఎమ్మెల్యే కోట్ల చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకు లు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పౌర హక్కులను పరిరక్షించాలి



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోవెలకుంట్ల తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గుంజలపాడు గ్రామంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి పౌరుడు స్వతంత్రంగా జీవించే హక్కు ఉందని, వారి హక్కులకు భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ కలిసి మెలసి జీవించాలని అన్నారు. ముఖ్యంగా ఒకరిపై ఒకరు ఘర్షణలు పడకుండా సామరస్యంగా జీవించాలని అన్నారు. ఎంపీడీవో వరప్రసాద్‌రావు మాట్లాడుతూ గ్రామాలకు వచ్చే నిధులు దుర్వినియోగం కాకుండా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో కనీస సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిరంజన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## 50 మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు



**ఉద్యోగం పొందిన వారికి నియామక పత్రం అందచేస్తున్న కలెక్టర్, జెసి**

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగాలు ఇస్తూ జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లోఅభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇది మంచి అవకాశం అని ఉద్యోగాలు పొందిన వారు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూ చించా రు. 50మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామక పత్రాలు అందచేసినందుకు కలెక్టర్ డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ,, ఏఓ విజయ లక్ష్మిలను అభినందించారు. ఈ సమావేశంలో జెసి నవ్య పాల్గొన్నారు.

# ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్ పంపిణీలో పాల్గొన్న మంత్రి బి.సి



**ఫించన్ పంపిణీ చేస్తున్న మంత్రి బి.సి**

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని పలుకూరు గ్రామంలో ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు పెట్టుబడులు మరియు మౌళిక సదుపాయాల మంత్రి పాల్గొన్నారు. వారు పలుకూరు గ్రామానికి చేరుకోగానే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి సాదర స్వాగతం పలికారు. ఫించన్ లబ్దిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి వారి యోగ క్షేమాలు అడిగి ఇంటి వద్దే ఫించన్‌లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు సంక్షేమం కోరుకునే మంచి ప్రభుత్వమన్నారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచన మేరకు ఒకరోజు ముందస్తుగానే లబ్దిదారులకు ప్రభుత్వం పించన్‌లు అందజేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల క్రమం తప్పకుండా దాదాపుగా 64లక్షల మంది లబ్దిదారులకు ఫించన్‌లు అందిస్తున్నామన్నారు. జూన్ నెల నుండి కొత్తగా 31వేల మంది లబ్దిదారులకు స్పౌజ్ ఫించన్‌లను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఒకేసారి మూడు నెలల ఫించన్ తీసుకొని వెసులుబాటుని కల్పించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల రామకృష్ణా రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, మండలస్థాయి అధికారులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**బండి ఆత్మకూరు రూరల్ మేజర్ న్యూస్ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఒత్తిడిని జయించడానికి యోగ ఏకైక మార్గమని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ భావన రెడ్డి,ఆయుర్వేద డాక్టర్ నాగరాజు తెలిపారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ శిక్షకులు నాగేశ్వరావు, చరిత ఆధ్వర్యంలో యోగ వెబ్సైట్ నందు ట్రైనీగా నమోదు చేసుకున్న ఉద్యోగులకు శిక్షణ కల్పించారు. వారం రోజులపాటు జరిగే ఈ యోగా శిక్షణ కార్యక్రమంలో ఉద్యోగులకు యోగాలో మెలకువలు నేర్పిస్తామని వారు తెలిపారు. యోగ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సహాయం అందజేత



**ఆర్థిక సహాయం అందజేస్తున్న బుగ్గరాముడు**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ నందు అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద ముస్లిం మహిళ షాహిదకు వార్డు టీడీపీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు రూ.8 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న షాహిద దీన స్థితిని తెలుసుకొని ఆమె ఇంటికి వెళ్ళి పరామర్శించి మనోధైర్యం కల్పించడం జరిగిందని అన్నారు. ఆరోగ్య ఖర్చుల నిమిత్తం నగదు ఆర్థిక సహాయం అందజేశామని అన్నారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర యువనాయకుడు ఎన్ఎండీ ఫయాజ్‌ల ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు తాము ఎప్పుడు అండగా ఉంటామని అన్నారు. వార్డులోని ప్రతి ఒక్కరికీ ముందుండి సహాయ సహకారాలు అందిస్తుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్‌బాబు, చిన్న రాముడు, హాజీవలి, శివ, మోజేష్, ఇమామ్ హుసేన్, చెన్నయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రమంతా అభివృద్ధి ఫలాలు

**(మొదటిపేజి తరువాయి..)** చంద్రబాబునాయుడు కీలకమైన పరిశ్రమల శాఖను భరత్‌కు కట్టబెట్టడంతోనే ప్రభుత్వంలో ఆయన పాత్ర ఏమిటన్నది స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలంతా చంద్రబాబు పని తీరును మెచ్చుకుంటు న్నారని ఆయన చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతోనే పారిశ్రామికవేత్తలకు భరోసా వచ్చిందని ఆయన పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం అభివృద్ధి అనే పదానికి అర్థం లేకుండా చేసిందని, ఆ సమయంలో ఏపి అంటేనే పారిశ్రామికవేత్తలు అడుగు వెనక్కు వేశారని ఆయన తెలిపారు. ఇప్పుడు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, ఒక్క ఏడాదిలోనే 9.30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 72 ప్రాజెక్టులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రాబోతున్నాయని ఆయన వివరిం చారు. నిమయ నిబంధనల మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన వెంటనే పారిశ్రామికవేత్తలు పనులు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ఇవి పూర్తయితే 5.7లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, హామీ ఇచ్చిన మేరకు 2029 ఎన్నికల నాటికి రాష్ట్రంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి టి.జి.భరత్ చెప్పారు. ఆర్సెలర్ మిట్టల్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్, బిపిసిఎల్ లాంటి పెద్ద కంపెనీలు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టబోతున్నాయని ఆయన చెప్పారు. 2029 నాటికి రాష్ట్ర స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన వివరించారు. కడప స్టీల్ ప్లాంట్ పనులు ముఖ్యమంత్రి చెప్పినట్లుగా జూన్ నెల 12వ తేదీలోగా ప్రారంభం అవుతాయని మంత్రి భరత్ చెప్పారు.

## గడియారం ఆసుపత్రి నిర్వహణ పెద్దాసుపత్రికి :

దశాబ్దాలుగా గర్భిణీ స్త్రీలకు కాన్పులు చేస్తూ సేవలు అందిస్తున్న పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి నిర్వహణను పెద్దాసుపత్రికి కేటాయి స్తున్నామని, దీంతో పాతబస్తీ మహిళలకు సులభంగా వైద్యసేవలు అందుతాయని ఆయ న చెప్పారు. పెద్దాసుపత్రిలో కూడా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, వైకాపా ప్రభుత్వ హయాంలో దీన్ని నిర్లక్ష్యం చేశారని ఆయన విమర్శించారు. ఇటీవలే స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

## జూన్ 21న గ్రీన్‌కో ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ :

ఓర్వకల్లు సమీపంలో గ్రీన్‌కో ఆధ్వర్యంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని మంత్రి టి.జి.భరత్ చెప్పారు. నీరు, గాలి, సోలార్ ద్వారా ఒకే కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రం ప్రపంచంలోనే ఇదే మొదటిదని ఆయన చెప్పారు. ఇక్కడ రాత్రి సమయాల్లోనూ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని, ఫలితంగా క్లిష్ట సమయాల్లోనూ విద్యుత్ సరఫరా ఆగకుండా సాగుతుందని ఆయన చెప్పారు. ఓర్వకల్లు వద్ద దాదాపు నిర్మాణాలు పూర్తి చేసుకుని ఉత్పత్తి వైపు సాగుతున్న జైరాజ్ ఇస్పాత్ కంపెనీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. వైకాపా ప్రభుత్వ వైఖరి కారణంగా ఈ ప్రాజెక్టు ప్రారంభం నాలుగేళ్లు ఆగిపోయిందని, ఫలితంగా కంపెనీపై 120కోట్ల రూపాయల అదనపు భారం పడిందని ఆయన చెప్పారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు అవసరమైన నీటి సరఫరా పనులు త్వరలోనే పూర్తవుతాయని ఆయన చెప్పారు. సెమీ కండక్టర్ల పరిశ్రమలకు సంబంధించి కేంద్రం పాలసీ ఆమోదం పొందిన వెంటనే దానికి సంబంధించిన రెండు పరిశ్రమలు ఓర్వకల్లుకు వస్తాయని ఆయన చెప్పారు. ఎలక్ట్రానిక్ స్కూటర్ల పరిశ్రమ ఏర్పాటుకు భూమి కేటాయించిన తర్వాత ఏడాదిలోగా ఉత్పత్తి చేస్తామని సంబంధిత పారిశ్రామికవేత్త హామీ ఇచ్చారని టి.జి.భరత్ చెప్పారు.

## జూలై 2 నుండి కర్నూలు నుండి విజయవాడకు విమానాలు :

జూలై 2వ తేదీ నుండి కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని మంత్రి టి.జి.భరత్ చెప్పారు. కేంద్ర విమానా యాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో తాను చేసిన సంప్రదింపులు ఫలితాన్నిచ్చాయని, రోజూ ఈ విమానాలు నడిపేందుకు ప్రయత్నిస్తా నని ఆయన చెప్పారు. విమానాశ్రయంతో దుబాయి అభివృద్ధి చెందిందన్న ఆయన ఓర్వకల్లు విమానాశ్రయం నుండి దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులకు విమానాలు నడపాలన్నది తన ఆశయమని ఆయన చెప్పారు. అలాగే ఓర్వకల్లు విమానాశ్రయంలో రెండు పైలెట్ శిక్షణా కేంద్రాలు రాబోతున్నాయని ఆయన చెప్పారు. పైలెట్ శిక్షణ ఖరీదైనదే అయినా డిమాండ్ ఉందని ఆయన చెప్పారు.

## స్మార్ట్ సిటీగా కర్నూలు :

ఒకనాటి రాజధాని కర్నూలును స్మార్ట్ సిటీగా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇందుకోసం కన్సల్టెన్సీని నియమించామని మంత్రి భరత్ చెప్పారు. రహదారులు, మురుగుకాలువలు, వీధిదీపాలు, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రధానంగా దృష్టి సారిస్తామని ఆయన వివరించారు. ప్రస్తుతం సుంకేసుల రిజర్వాయర్ నుండి కెసి కెనాల్ మీదుగా ఎస్‌ఎస్ ట్యాంకుకు నీటిని తీసుకుంటున్నామని, అలా కాకుండా సుంకేసుల నుండి ఎస్‌ఎస్ ట్యాంకుకు నేరుగా పైపులైన్ ద్వారా నీటిని తీసుకోబోతున్నామని, పనులు దాదాపు పూర్తయ్యాయని ఆయన చెప్పారు. అలాగే ఏడాది పాటు వర్షాలు రాకపోయినా కర్నూలు నగర ప్రజలకు తాగునీటికి సమస్య రాకుండా ఏర్పాట్లు చేస్తామని ఆయన చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ఫైఓవర్లు అవసరమా? అన్నది అధ్యయనం చేయిస్తున్నామని ఆయన చెప్పారు. బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏపీఎస్పీ క్యాంపు లోపల నుండి రోడ్డు నిర్మించామని ఆయన చెప్పారు. మెడికల్ కళాశాల వద్ద పాత దుకాణాలను కూడా తొలగిస్తామని ఆయన తెలిపారు. జిల్లాపరిషత్ వెనుక వైపు హంద్రీ నదిలో రోడ్డు వేస్తున్నామని, పాతబస్తీకి వెళ్లాల్సిన వారు అటు వెళ్లవచ్చని ఆయన చెప్పారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేటకు వెళ్లే రహదారి, పూలబజార్ వద్ద రోడ్డు విస్తరణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. రహదారి విస్తరణలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారి స్థలాల్లో నిర్మాణాలు తొలగిస్తూ పనులు ప్రారంభించాలని కెఎంసి అధికారులకు సూచించానని, రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరిస్తారన్న విశ్వాసం తనకు ఉందని ఆయన చెప్పారు. ఇది సున్నితమైన అంశమని ఆయన అన్నారు. నగర నడిబొడ్డున ఉన్న ఎగ్జిబిషన్ మైదానాన్ని నగర ప్రజలకు అహ్లాదాన్ని అందించే కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆయన చెప్పారు.

## హైకోర్టు బెంచ్ వస్తుంది :

కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఖచ్చితంగా వస్తుందని, మహానాడు వేదిక మీద కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన సంకేతాలిచ్చారని మంత్రి టి.జి.భరత్ చెప్పారు. ఇప్పటికే ఉన్న భవనాలతో పాటు పలు స్థలాలను హైకోర్టు బెంచ్ భవనాల కోసం పరిశీలించారని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే బెంచ్ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికే కర్నూలులో ఏర్పాటైన లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ లాంటి కార్యాలయాలు ఎక్కడకూ తరలించరని, దీనిపై ముఖ్యమంత్రి కూడా స్పష్టంగా చెప్పారని ఆయన గుర్తు చేశారు.

# శ్రీశైలంలో అహల్యబాయి హెూల్కర్ జయంతి వేడుకలు

**హాజరైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్**

**బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు షబానా ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు**



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలంలో అహల్యబాయి హెూల్కర్ 300 వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు.బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మైనార్టీ మోర్చా షబానా మోమిన్,బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్, హైదరాబాద్ పార్లమెంటు అభ్యర్థి మాధవి లత,శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీశైలం బిజెపి నాయకులు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు చదువుల శ్రీను వివరిస్తూ పుణ్య శ్లోక అహల్యబా యిగా రాజమాతగా పరిపాలన దక్షురాలుగా ఖజానాను కాపాడే విధంగా ఆర్థిక సంస్కరణ చేసిందని ఇప్పుడు జరుగుతున్న అభి వృద్ధి కార్యక్రమాలు ప్రధాని మోడీ ఆమెను స్ఫూర్తిగా చేస్తు న్నారని పేర్కొన్నారు.

**సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన మంత్రి :** శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలోని ప్రభుత్వ వైద్య శాలను మంత్రి సత్య కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.శ్రీశైలం వచ్చిన ఆయన నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి,సుండిపెంట ప్రభుత్వ వైద్య శాలను పరిశీలించారు.రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.అలాగే వైద్యశాల్లో నెలకొన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు.ఈ సందర్భంగా వైద్యశాల మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సోహెల్ వైద్యశాల నెలకున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఆయన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.అనంతరం ఆయన శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని కూడా సందర్శించారు. అంతకంటే ముందు శ్రీశైలం చేరుకున్న మంత్రికి అతిథి గృహం వద్ద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి,బిజెపి నాయకులు, మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు షబానా పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.

**మల్లన్న సేవలో ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శనివారం ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.దర్శనార్థమై ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రికి ఈవో శ్రీనివాసరావు,అధికారులు,అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.ప్రత్యేక పూజలు అనంతరం ఆశీర్వచనలు అందజేసి శేష వస్త్రం,లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్



ఆలయ ప్రాంగణంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, సింగర్ మనో శనివారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ రాజగోపురం వద్ద ఆయనకు దేవస్థాన ఈవో శ్రీనివాసరావు, అధికారులు,అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనలు వల్లీం చగా అధికారులు శేషవస్త్రం,లడ్డు ప్రసాదాలు జ్ఞాపికతో సత్కరించారు.అంతకం టే ముందు శ్రీశైలం చేరుకున్న స్పీకర్కు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మే నెలకు సంబంధించి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం 1వ తేదీ సెలవు దినం కాబట్టి శనివారమే పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలం మొత్తం మీద 3770 మంది పింఛన్లు ఉండగా రూ.1.60 కోట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే మండలానికి కొత్తగా భర్త చనిపోయిన మహిళలకు 43 కొత్త పింఛన్లు కూడా మంజూరైనట్లు ఆయన తెలిపారు. పింఛన్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సర్వేయర్ ప్రదీప్‌తో కలిసి పాంపల్లెలో నిర్వహించామని అన్నారు.

# ప్రజల ఆరోగ్య విషయంలో రాజీ లేదు..



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

- బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయిస్తే చర్యలు
- ఆళ్లగడ్డలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు అధికారులతో కమిటి
- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు తీసుకునే చర్యల గురించి మాట్లాడారు. చికెన్, మటన్ దుకాణాల్లో నాణ్యత లేని మాంసాన్ని విక్రయిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో తాను రాజీపడే ప్రసక్తే లేదని మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులర్ గా తనిఖీ చేయాలని ఆమె ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా పెరిగిపోయిందని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పోలీస్ శాఖతో కలిపి ఐదు మందితో కమిటీ ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్ నియంత్రణ సంబంధిత వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పందులు, కుక్కలు ఎక్కువగా ఉన్నాయని వీటితో సమస్య ఎక్కువగా ఉందని సంబంధిత యజమానులకు చెప్పి వాటిని నియంత్రించాలన్నారు. పన్నుల చెల్లింపులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధికి సంబంధించి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, మున్సిపాలిటీ అద్దె గదులు, ట్రేడ్ లైసెన్స్ లో కచ్చితంగా ప్రతి ఒక్కరూ కట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా టాక్స్ కలెక్షన్ చేసే విధంగా అధికారులు చర్యలు చూపాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని ప్రభుత్వం మీద ఆధార పడకుండా మనమే అభివృద్ధి చేసుకునే విధంగా పనిచేయాలన్నారు. 2027 సంవత్సరానికి 18 కోట్లు ఆదాయం వచ్చే విధంగా పని చేయాలని తాను మానిటరింగ్ చేస్తానన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. 122 కోట్ల రూపాయల వ్యయంతో మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు స్థలాల్లో కూడా కంప చెట్లు విపరీతంగా పెరిగిపోయాయని రోడ్లు మూసుకుని పోతున్నాయన్నారు. ప్రవేట్ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు విధిగా సమావేశాలకు హాజరు కావాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులపై అజెండాను వివరించడం జరిగింది. చైర్మన్, వైస్ చైర్మన్, డాక్టర్ రామలింగారెడ్డి, నాయబ్ రసూల్, మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి, ఏఈ తేజ రెడ్డి, కౌన్సిలర్లు హుస్సేన్ భాష, బాలబ్బి, గురుమూర్తి, శ్రీవిద్య తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం

- సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మాణం చేపట్టాలి
- ఘనంగా సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి



మాట్లాడుతున్న మహిళా సంఘం నాయకురాలు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదు ఏపీ అంటే అందరి ప్రదేశ్ అని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలని ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి తెలిపారు. శనివారం సంఘమేశ్వరం వద్ద సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని రాయలసీమ సాగునీటి సాధన పిలుపు మేరకు రాయలసీమలోని 8 జిల్లాల నుంచి ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, న్యాయ, విద్యార్థి, రైతు సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేలాది మంది ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి జయప్రదం చేశారు. ముందుగా వివిధ సంఘాల నేతృత్వంలో కళాకారుల బృందం గేయాలను ఆలపించారు. ఈ సందర్భంగా బొజ్జ దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ 2016 మే 31వ తేదీన ఇదే సిద్ధేశ్వరం వద్ద వేలాది మంది ప్రజలచే అలుగు నిర్మాణానికి శంకుస్థాపన జరిగి 9 ఏళ్లు పూర్తి అయినా ప్రభుత్వాల్లో చలనం రాలేదని అన్నారు. రాజకీయ నాయకులు కేవలం వారి స్వలాభం కోసం మాత్రమే రాయలసీమ వాదన ఎత్తుతున్నారే తప్ప ఆ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు అడుగులు వేయడం లేదని అన్నారు. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని అందుకు తగ్గట్లుగా బ్లూప్రింట్ పూర్తి చేశామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ వద్ద ఉన్న బ్లూప్రింట్ ద్వారా ఏ విధంగా నీరు రాయలసీమ రైతులకు ఇస్తారో చూపాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం వేలాది మంది భూములను త్యాగం చేసిన భూ నిర్వాహకులకు ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. పట్టిసీమ పూర్తి చేసి రాయలసీమకు నీరు ఇస్తామని చెప్పిన పాలకులు అది మరిచి నేడు గోదావరి, బాణకచెర్ల అంటూ కొత్త నాటకానికి తెరలేపుతూ రాయలసీమ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రాయలసీమ వాసులు గమనించాలని తెలిపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల మరమ్మత్తులకు నిధులు లేవంటున్న పాలకులు అమరావతిలో ఐకానిక్ టవర్ల కోసం వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నారని ఇది ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లు కాదా అని ప్రశ్నించారు. రూ.1500 కోట్ల నిధులతో ఖరీఫ్‌కు 10 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ ద్వారా అలగనూరు, గోరుకల్లు, అన్నమయ్య రిజర్వాయర్లను మరమ్మత్తు ద్వారా చేపట్టినట్లు అయితే సాగునీరు అందుతుందని అన్నారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ సాగు, త్రాగునీటికే వినియోగించాలని అన్నారు. గుండ్రేవుల, తుంగభద్ర, వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టాలని అన్నారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టినట్లు అయితే ఈ రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. రైతుల మనోభావాలను అర్థం చేసుకుని ఇప్పటికైనా పాలకులు ప్రాజెక్టు నిర్మాణానికి అడుగులు వేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నాగన్న, వరలక్ష్మి, వైఎన్ రెడ్డి, సిపిఎం రాజశేఖర్, మణెమ్మ, రామకృష్ణా రెడ్డి, రైతు సంఘం నాయకులు కొండా రెడ్డి, రామసుబ్బా రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, శేషాద్రి రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో సుధీర్ఘ కాలం పని చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో పని చేసి పోలీస్ సిబ్బంది పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. శనివారం జిల్లాలో పదవీ విరమణ పొందిన పోలీసులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య, డీసీఆర్‌బీ సబ్ ఇన్స్పెక్టర్ శంకర్‌రావు, ఆర్మడ్ రిజర్వ్ హెడ్‌కానిస్టేబుల్ జగన్‌మోహన్‌రెడ్డిలు సుదీర్ఘకాలం తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పోలీస్ శాఖకు సేవలు అందించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. కుటుంబాలతో సంతోషాలతో గడపాలని, ఏదైనా సమస్య ఉంటే తమను నేరుగా సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

# నేల ఆరోగ్య సంరక్షణ, సుస్థిర పత్తి ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా



బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రైతులకు నేల ఆరోగ్య సంరక్షణ, సుస్థిర పత్తి ఉత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నేల ఆరోగ్య సంరక్షణ, పత్తిలో పంట రక్షణ యాజమాన్యం బుక్‌లెట్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా సాగు చేపడుతున్న పత్తి పంట సాగులో సుస్థిరమైన పద్ధతులు ప్రవేశపెట్టడానికి మారి స్వచ్ఛంధ సేవా సంస్థ, జిల్లా వ్యవసాయ శాఖతో కలిసి ఒక వినూత్నమైన 'బెటర్ కాటన్ ప్రాజెక్టు' కార్యక్రమం కోడుమూరు, దేవనకొండ మండలాల్లో అమలు చేస్తున్నారన్నారు. దాదాపు 8,075మంది రైతులతో ఈ కార్య క్రమం అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా రైతులకు సుస్థిర పత్తి ఉత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.వి నవ్య, డిఆర్ఓ సి వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, మారి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ పాల్గొన్నారు.

# క్రీడా దుస్తులు పంపిణీ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిత్యం వాలీబాల్ శిక్షణలో పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రోత్సాహకంగా విశ్రాంత ఆర్టీసి ఉద్యోగి, పూర్వపు జాతీయ హాకీ క్రీడాకారుడు పివి శివరాములు క్రీడా దుస్తులను అందచేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పివి శివరాములుతో పాటు డిఎస్‌డిఓ భూపతిరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా వచ్చే ప్రశంసపత్రాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ సంఘం కార్యదర్శి షరీఫ్, ఉపాధ్యక్షులు దస్తగిరి, వాలీబాల్ శిక్షకులు రాజేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాదుస్తులు అందచేస్తున్న పివి శివరాములు

సూర్య www.suryaa.com
ఆదివారం | 01 జూన్ 2025

# ఐపిఎల్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్టు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :**

ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఏడు మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని డిఎస్పీ హేమలత సూచనల మేరకు ఆదోని వన్ టౌన్ సిఐ శ్రీరామ్, సిబ్బంది రాబడిన సమాచారం మేరకు ఈ నెల 18న వాల్మీకి నగర్‌లోని వాల్మీకి దేవాలయం ఎదురుగా మొబైల్ ఫోన్‌లలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై దాడి చేసి ఎస్ ఆర్ నాగరాజును అదుపులోకి తీసుకోగ మిగిలిన ముద్దాయిలు పారిపోయారని తెలిపారు. నింధితుడి వద్ద నుండి రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారన్నారు. టెక్నాలజీ ఆధారంగా దొరికిన సమాచారం మేరకు ఈ నెల 30న ఆదోని పట్టణంలోని ఎల్లమ్మ కొండలోని మర్రిచెట్టు దగ్గర 7మంది క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ.91వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. క్రికెట్ బుకీలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన ఆదోని డిఎస్పీ,వన్ టౌన్ సిఐ, ఎస్ఐలు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కొనిదేడు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు తనిఖీ చేసిన మంత్రి బి.సి


బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** పాణ్యం సమీపంలోని వద్దెల వాగుపై కొణిదేడు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు పెట్టుబడులు మౌళిక సదుపాయాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి శనివారంనాడు అకస్మికంగా తనిఖీ చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజా రవాణాకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడా లని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను చెక్ చేసి అధికా రులకు సూచనలు చేశారు. వర్షాకాలంలోపు బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**పంపిణీలో పాల్గొన్న మండల అధికారులు**


పెన్షన్ పంపిణీ చేసిన మండల ప్రత్యేకధికారి రంగనాథ్ బాబు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో శనివారం మండల అధికారులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌పంపిణీ చేశారు.రాష్ట్రప్రభుత్వం వృదాప్య,విత్తంతు,దివ్యాంగుల వంటి కేటగిరిల కింద ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ అందిస్తుంది.అందులో భాగంగామండలంలో పెన్షన్ పంపిణీలో ఎంపీడీఓ రాణెమ్మతో కలసి మండల ప్రత్యేకధికారి రంగనాథ్ బాబు పాల్గొని పెన్షన్ అందించారు.మండలంలో7040 పెన్షండ్లు పంపిణీ చేయాల్సి ఉండగా మండల వ్యాప్తంగా ఒక్కరోజులో 6469పెన్షండ్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పెన్షన్ అందని వారు సోమవారం ఆయా గ్రామ సచివాలయం దగ్గర సచివాలయం సిబ్బంది నుండి పెన్షన్ తీసుకోవచ్చాన్నారు. ఒకటో తారీకు ఆదివారం కావడంతో ప్రభుత్వం ఒక్కరోజు ముందుగానే పెన్షన్ అందిచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకధికారి రంగనాథ్ బాబు,ఎంపీడీఓ రాణెమ్మ సచివాలయం పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డు లేదా?

**సంజామలమేజర్,న్యూస్:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డు అదుపు లేకుండా పోయిందని సంజామల మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు వాపోయారు. అవుకు సబ్ రిజిష్టర్ కార్యాలయం నందు అవినీతి రాజ్యమేలుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సాతాని చిన్న దేవుడుకు చెందిన సర్వే నెం. 402లో ఉన్న 5.44 సెంట్ల భూమిని మంచాల చిన్న సింగారెడ్డికి అక్రమంగా రిజిస్టర్ చేశారు. ఈ విషయంపై ఆర్డీఓ దగ్గర ఆర్.ఓ.ఆర్ కేసు నడిచింది. సబ్ రిజిస్ట్రార్‌కే తెలియకుండా అడ్డదారిలో ఇళ్లు, భూములు రిజిస్ట్రేషన్ చేయించి ఆ తరువాత లోన్లు కూడా ఇప్పించి లక్షలు దండుకున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో జరుగుతున్న తతంగాన్ని నిలువరించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పుట్టిన రోజు నాడే కబళించిన మృత్యువు

**కృష్ణానదిలో మునిగి సున్నిపెంటకు చెందిన యువకుడు మృతి**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:**



శ్రీశైలం డ్యామ్ దిగువన కృష్ణానదిలో సున్నిపెంటకు చెందిన ఓ యువకుడు నీట మునిగాడు. వివరాల్లోకి వెళితే..ఏపీ జెన్కో కాలనీకి చెందిన నిఖిల్ (17) గుంటూరులో డిప్లమా మొదటి సంవత్సరం పూర్తి చేశాడు.బర్త్ డే కావడంతో సరదాగా స్నేహితులతో కలిసి లింగాలగట్టు పెద్ద బ్రిడ్జి కింద కృష్ణానదిలో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు జారి పిల్లర్ వద్ద నీట మునిగాడు. సమాచారం తెలుసుకున్న సున్నిపెంట పోలీసులు అక్కడికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో నీటిలో గాలించగా పిల్లర్ అడుగుభాగాన ఆ యువకుడు మృతి చెంది ఉన్నాడు.సదరు ఘటన జరిగిన ప్రాంతం తెలంగాణ పరిధిలోకి రావడంతో అక్కడ పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు.ఆ యువకుడు తండ్రి ఏపీ జెన్కో ఉద్యోగం చేస్తున్నాడు.పుట్టినరోజు నాడే మృతు కబళించటం పట్ల ఆ కుటుంబంలో విషాదఛాయలు అమలుకున్నాయి.

# పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**వైసిపి ఉనికిని చాటుకున్నందుకు ప్రయత్నాలు**
**ఎమ్మిగనూరు నియోజకవర్గం అద్భుతంగా తయారుచేస్తా**
**పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి**


వృద్ధురాలకు పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి ముందుకు పోతున్నారని, ఒకరోజు ముందే పెన్షన్ అందిస్తున్న ఘనతసీఎంచంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక 28వ వార్డు వెంకటాపురం కాలనీలో ఎమ్మెల్యే బీవీ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. వెంకటాపురంలో విస్తృతంగా పర్యటించిప్రజలు నెలకొంటున్నసమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. తాగునీటిసమస్యను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు వెంటనే సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వానికి పెన్షన్ పెంచడానికి నాలుగేళ్లు పట్టిందన్నారు. గత పాలనలో ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. అతి త్వరలోనే తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ వంటి సూపర్ పథకంలో ఉన్నటువంటి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా గత పాలకులు లిక్కర్ స్కాం చేశారని ఆరోపించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గాన్ని అద్భుత నియోజకవర్గంగా తయారు చేసేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే బీవీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిడిపి నాయకులు పార్టీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవీణ్ మృతి బాధాకరం పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గంగుల


మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని వినాయక నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రవీణ్(30) అనే ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బ్రెయిన్ స్ట్రోక్తో ఆకస్మికంగా మృతి చెందాడు. అతని మరణ వార్త సమాచారం అందుకున్న ఆళ్ళగడ్డ మాజి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి చాగలమర్రికి చేరుకొని ప్రవీణ్ మృత దేహన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. వివరాల్లోకి వెళితే మండలంలోని పెద్దవంగలి గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న పగిడాల వెంకట నరసింహులు భార్య సత్యవతి దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో పెద్దవాడైన మృతుడు ప్రవీణ్ అగ్రికల్చర్ బిఎస్సి విద్యను పూర్తి చేసి చిత్తూరు జిల్లా మదనపల్లెలోని ప్రకృతి వ్యవసాయ కేంద్రంలో ఏడాదిగా మాస్టర్ ట్రైనర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కర్నూలు పట్టణంలో స్నేహితుడి వివాహానికి హాజరయ్యాడు. వివాహ వేడుకల్లో ఉన్న ప్రవీణ్ అకస్మికంగా క్రిందపడటంతో స్నేహితులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి బ్రెయిన్ స్ట్రోక్తో మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లీదండ్రులు షాక్కు గురై ఆపస్మారక స్థితికి చేరుకున్నారు. వినాయకనగర్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కోర్టు నూతన భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** పత్తికొండ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు నూతన భనవ నిర్మాణం కోసం స్థలాన్ని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లీలా వెంకటే శేషాద్రి పరిశీలించారు. శనివారం స్థానిక మఠ్రో బావి సమీపంలో ఉన్న స్థలాన్ని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి జోత్స్న దేవితో కలిసి జిల్లా సేవాధికారి సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఆదేశాల మేరకు పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి నివేదికలను జిల్లా జడ్జికి అందజేస్తామని వివరించారు. వారితోపాటు పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు, న్యాయవాది దామోదరాచారి పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ధ్వజస్థంభ ప్రతిష్ఠకు హాజరైన బి.సి ఇందిరమ్మ


ధ్వజస్థంభ ప్రతిష్టలో పాల్గొన్న బి.సి ఇందిరమ్మ

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామంలో ఆంజనేయస్వామి ధ్వజస్థంభ ప్రతి ష్ట మహోత్సవంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ పాల్గొన్నారు. ఉప్పు లూరు గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఆమె శనివారంనాడు ఆంజనేయస్వామి ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చే శారు. వారు గ్రామానికి చేరుకోగానే గ్రామ టీడీపీ నాయకు లు ఐ.వి పక్కీరారెడ్డి ఆధ్వర్యంలో వారికి ఘనస్వాగతం పలి కారు. అనంతరం ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం బి.సి ఇందిర మ్మకు ఆంజనేయస్వామి వారి తీర్థప్రసాదాలను పురోహితులు అందజేశారు.

## పదవీ విరమణ చేసిన ఏఎస్ఓకు సన్మానం

**కర్నూలు,మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** జిల్లాపౌరసరఫరాలశాఖలో ఏఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న బి రామాంజనేయరెడ్డి శనివారం పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా కలెక్టరేట్లోని సునయన ఆడిటోరంలో పౌరసరఫరాల శాఖ డీఎస్ఓ రాజా రఘువీర్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రెవిన్యూ పౌరసరఫరాల శాఖలో వివిధ హెూదాల్లో పని చేసిన రామాంజనేయరెడ్డి ఎన్నో సేవలు అందించారని ప్రశంసించారు. ఉద్యోగులకు పదవీ విరమణ అనేది అనివార్యమన్నారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత రామాంజనేయరెడ్డి తన ఉద్యోగ జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను గుర్తు చేసుకున్నారు. తన విధుల నిర్వహణలో అండగా నిలిచిన అధికారులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏఎస్ఓను శాలువాలు, పూల మాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ నాయకులు రామాంజనేయులు, రెవిన్యూ, పౌర సరఫరాల శాఖ, కలెక్టరేట్ సిబ్బంది, రేషన్, ఎల్.పి.జి డీలర్లు, పాల్గొన్నారు.



# మంత్రి ఫరూక్ ను కలిసిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** డాక్టర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఫరూక్ ను నంద్యాల క్యాంపు కార్యాలయంలో, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏ.వి.ఆర్. ప్రసాద్‌లతో కలసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో తాను కర్నూలు వైద్య



కళాశాల ప్రిన్సిపల్ గా, కర్నూలు జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్‌గా పని చేసే సమయంలో వైద్య,ఆరోగ్యశాఖ మంత్రిగా ఫరూక్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాన్సర్ యూనిట్ కోసం, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించిన విషయం గుర్తు చేసి మంత్రి ఫరూక్ కు ధన్యవాదాలుతెలిపారు.మంత్రిఫరూక్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి ప్రతిష్టాత్మక డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ ను కోరారు.

# లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంటలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచడమే కాకుండా ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేసి శభాష్ అనిపించుకున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పెన్షన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి చంద్రబాబును తమ సొంత కొడుకు కంటే ఎక్కువగా చూసుకుంటున్నారని అంటున్నారన్నారు. ఆగస్టు15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం అవుతుందని త్వరలోనే తల్లికి వందనం అందజేయడం జరుగుతుందన్నారు. మహానాడుతో టిడిపి ప్రభుత్వం పట్ల ప్రజలకు ఉన్న ఇష్టం తెలుస్తుందన్నారు.ఈ సందర్భంగా మహిళలు చింతకుంట్ల గ్రామంలో కాలువలు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అఖిలప్రియ దృష్టికి తెచ్చారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.తెదేపా నాయకులు చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి, సోముల శేఖర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు మున్సిపాలిటీ స్థాయి పెరగడం పట్ల హర్షం

◆ ఎమ్మెల్యే బీవీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు గ్రేడ్ -01 మున్సిపాలిటీ నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా మారుస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వడం పట్ల మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే బీవీ నేతృత్వంలో ఎమ్మిగనూరు పట్టణ అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీవీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

# ఎంపీడీవో మహబూబ్ ఖాన్ సేవలు అభినందనీయం



పదవీ విరమణ పొందిన ఎంపీడీవో దంపతులకు సత్కరిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ఎంపీడీవో మహబూబ్ ఖాన్ సేవలు అభినందనీయమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్రరెడ్డిఅన్నారు.శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్ పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ గజల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవోగా ఆయన ప్రజలకు చక్కని సేవలు అందించారన్నారు. గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరితో కలుపుకోరిగాఉంటూగ్రామాలలోఅభివృద్ధిపనులుచేయించడం జరిగిందన్నారు. ఆయన శేష జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. పదవి విరమణ పొందిన ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ సర్వీస్ కమిషన్ ద్వారా తాను పంచాయతీరాజ్ శాఖలోకి ఉద్యోగిగా రావడం జరిగిందని టైపిస్టుగా, జూనియర్ అసిస్టెంట్‌గా,ఈవోఆర్డిగా,ఎంపీడీవోగా వివిధ హోదాల్లో పనిచేయడం జరిగిందన్నారు. విధి నిర్వహణ చక్కటి సంతృప్తి ఇచ్చిందన్నారు. అందరి సహకారంతోనే తాను ఎంపీడీవో గా మంచి సేవలు అందిం చడం జరిగిందన్నారు. అనంతరం ఆయనను ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి తోపాటు ఎంఈఓ శోభ వివేకావతి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఎన్ఆర్జీఎస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఎంపీడీవో దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహానంది ఎంపీడీవో మహమ్మద్ దౌలా, నంద్యాల డ్వామా ఏవో హనీఫ్ ఖాన్, ఇంచార్జ్ ఈఓఆర్డి అశ్విని కుమార్, ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయ ఏవో వెంకటసుబ్బయ్య, నంద్యాల ఏపిఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూముల వేలంలో తగ్గిన ఆదాయం

**దొర్నిపాడు మేజర్ న్యూస్ :** మండలపరిధిలోని క్రిస్టిపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీ నాగేశ్వర స్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానములకు ఒక సంవత్సరమునకు అనగా 2025-2026 వరకు శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ఆవరణములో దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో భూముల బహిరంగ కౌలు వేలము నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఈ ఓ బాల చెంచన్న మాట్లాడుతూ శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం సంబంధించి 25.58,ఎకరములు, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం సంబంధించి 24.46ఎకరములకు బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించడం జరిగిందని గత ఏడాది కౌలు మొత్తం -11,73000,ఈ ఏడాది 9,30000రాగ సుమారు రూ 2,43000ఆదాయం తగ్గిందని వేలం పాటలో 23మంది డిపాజిట్ చేయగా 7మంది వేలంలో కౌలు కు పొలం దక్కించుకున్నారని అయన తెలిపారు మిగతావారి డిపాజిట్ తిరిగి ఇవ్వడం జరిగింది అని అయన తెలిపారు ఈ కార్యక్రమం లో ఈ ఓ బాల చెంచన్న, కార్యనిర్వహణ అధికారి వేమనాథ రెడ్డి టిడిపి నాయకులు బి, వెంకటరామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి పల్లె సాంబశివరెడ్డి, శంకర్ రెడ్డి, శివరామిరెడ్డి సర్పంచ్, వైస్ సర్పంచ్ మహేష్, కృష్ణారెడ్డి మల్లు శివరామిరెడ్డి పల్లె ప్రసాద రెడ్డి ఏ ఎస్ ఐ రంగయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**పాములపాడు, మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ యోగాను చేయడం అలవాటు చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో యోగాసనాలు వేశారు.



ఈ సంద ర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ప్రజలందరూ శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడంతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చున్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను చేసుకోవడం అలవాటు చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పనిశ్వర్ రెడ్డి, గాయత్రి, సచివాలయ, రెవెన్యూ ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలం ఘాట్లో రెండు కార్లు ఢీ



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం ఘాట్ రోడ్లో శనివారం రెండు కార్లు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. సున్నిపెంట నుంచివెళ్తున్నకారు ఎదురుగా వస్తున్న మరో కారును ప్రమాద వశాత్తు ముఖద్వారం సమీపంలో ఢీకొంది.ఈ ప్రమాదంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడింది.ఎవరికి ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# ఒక్కరోజు ముందే 89 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి

**పాములపాడు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ 31 తేదీననే పంపిణీ చేశామని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సాయంత్రం వరకు 90 శాతం మందికి ఇంటి వద్దకే వెళ్లి అధికారులు పెన్షన్ పంపిణీ చేసినట్టు తెలిపారు. శనివారం మండల పరిధిలోని చెలిమిల్ల గ్రామ పంచాయతీ పరిధిలో పెన్షన్ లబ్ధిదారులకు ఎంపీడీ వో



పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం ఉండడంవల్ల ఒకరోజు ముందుగానే పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

# టీడీపీతోనే పేదల అభివృద్ధి సాధ్యం



లబ్ధిదారుకు పింఛన్ సొమ్మును అందిస్తున్న సురేష్

**గూడూరు మేజర్ న్యూస్:** టిడిపి ప్రభుత్వంలోని పేదలకు సంక్షేమ పథకాలను అందించడంతోపాటు అభివృద్ధి సాధ్యపడుతుందని టిడిపి మండల కన్వీనర్ సురేష్ పేర్కొన్నారు. మున గాల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం స్థానిక టిడిపి నాయకుడు గోపాల్ ఆధ్వర్యంలో ఆయన పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వృద్ధులు, వితంతువులు, విక లాంగులకు నెలకు రూ. 4000 నుంచి రూ. 6000 వరకు పింఛన్ సొమ్మును అందిస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం పార్టీదేనన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించే కార్యక్రమాన్ని సీఎం చంద్ర బాబు నాయుడు చేయనున్నా రన్నారు. పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కొరకు పాటుపడుతున్న టిడిపి కి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని ఆయన తెలిపారు. రామచంద్రుడు, డీలర్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# కరాటేతోనే ఆత్మరక్షణ - బి.సి రాజారెడ్డి



సర్టిఫికేట్లను అందజేస్తున్న బి.సి రాజారెడ్డి

**- విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు అవసరం**

**బనగానపల్లెరూరల్,న్యూస్:** విద్యార్థినీ విద్యార్థులు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక మానసిక ధృఢత్వం లభిస్తుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. శనివారంనాడు బనగానపల్లె పట్టణంలోని ఇండోర్ స్టేడియం నందు టెన్‌స్పోర్ట్స్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో కరాటే సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రీడల్లో చురుగ్గా పాల్గొనే అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడల వల్ల పిల్లలో వొత్తిడిని తగ్గించడంతోపాటు మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం పెంపొందుతాయని అన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల అభిప్రాయాలు రుద్దకుండా వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌లకు అలవాటుపడి విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఎక్కువ మంది రోగాల బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యంపట్ల అందరూ శ్రద్ధవహించాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికేట్లను అందజేశారు.

సూర్య

ఆదివారం | 01 జూన్ 2025

# నాసిరకంగా 340సి జాతీయ రహదారి పనులు : మంత్రి బిసి

- రహదారి పనులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు
- నాసిరకంగా 340సి రహదారి పనులు
- కాంట్రాక్టర్ పై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆగ్రహం
- క్వాలిటీ కంట్రోల్ అధికారుల పై చర్యలు తీసుకుంటాం
- విజిలెన్స్ కమిటీ ద్వారా విచారణ జరిపిస్తాం
- రైతుల పొలాలకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని వినతి






సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ.జనార్దన్‌రెడ్డి

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి 340సి పనులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు మండల పరిధిలోని 10 బొల్లవరం వద్ద నేషనల్ హైవే 340సి పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి ఇరువైపులా కోతకు గురైంది. దీనిపై స్పందించిన (రాష్ట్ర రోడ్లు మరియు భవనాల) శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా బర్మ్‌లను వేసేందుకు గ్రావెల్, తదితర సామగ్రి సమకూర్చాల్సి అని అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్ పనిచేయాలని రోడ్డు మరమ్మతులు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కాంట్రాక్టర్ పై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించినట్లు పలు పత్రికలలో కథనాలు వెలుపడ్డాయని తెలిపారు. కర్నూలు–గుంటూరు జాతీయ రహదారి 340సి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించబడటం లేదని ఆరోపణలు వస్తున్నాయన్నారు. నాసిరకం మట్టిని వాడటం, మరియు తగినంత పర్యవేక్షణ లేకపోవడం వంటివి ఈ సమస్యలకు కారణమని తనిఖీ లో గుర్తించామని తెలిపారు.రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన క్వాలిటీ కంట్రోల్ అధికారుల పై చర్యలు తీసుకుంటామని అన్నారు. విజిలెన్స్ కమిటీ ద్వారా విచారణ జరిపిస్తామన్నారు. నివేదికలు సిద్ధం చేసి సీఎం కు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ ప్రజా రవాణాకు ఎటువంటి అడ్డంకులు లేకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అదే సమయంలో నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. రైతుల పొలాలకు సంబంధించి రస్తా కొరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని మంత్రికి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ వీరంప్రసాద్ రెడ్డి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి , పట్టణ కౌన్సిలర్ గుంజుపల్లె భాస్కర్ రెడ్డి, మిడుతూరు, పగిడ్యాల టిడిపి మండల కన్వీనర్లు కాతా రమేష్ రెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో నేడు జరగబోయే కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో మొత్తం 16పరీక్ష కేంద్రాల్లో 7588మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని కావున అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.

## మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయాలి

**– కలెక్టర్ పి రంజిత్ బాషా**



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** హరితాంధ్రలో భాగంగా ఈ నెల 5వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హరితాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో ఒక లక్ష మొక్కలు నాటాలన్నారు. అటవీ శాఖ అధికారులు మొక్కలు అన్ని ప్రదేశాలలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సంబంధించి గార్గేయపురంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్యామల, కమీషనర్ రవీంద్రబాబు, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి వెంకట రమణయ్య, మెప్మా పిడి నాగ శివలీల, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌లు తేజశ్రీ, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులు ఇబ్బంది పడకుండా రెండవ గేట్ తెరుస్తాం

**:– సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు**



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స నిమిత్తం వచ్చే రోగులు ఎటువంటి ఇబ్బంది పడకూడదన్న సదుద్దేశ్యంతో ఆసుపత్రి రెండవ గేట్‌ను సోమవారం నుండి తెరుస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోగులకు వేగంగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ నెల 2న (సోమవారం) నుంచి 2వ గేట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే పార్కింగ్ సమస్య తలెత్తకుండ పార్కింగ్ స్థలాలను కూడా గుర్తించామని వాటిని అభివృద్ధి చేసిన తర్వాత అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. దీంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత

**ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి**



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల, కూటమి నాయకులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్రస్తుత సమాజంలో బ్రతకడానికి చేస్తున్న ప్రయాణంలో కాస్త ఆధ్యాత్మికత కలిస్తే మనస్సుకు ప్రశాంతతా లభిస్తుందని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ భారతి, ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఈఓ ఆర్‌డి శివకుమార్‌గౌడ్, పిఆర్‌ఏఈ ప్రభాకర్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్, ప్యాపిలి మండల టిడిపి ఇంచార్జ్ ఎదులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు ఖాజాపీరా, బత్తుల రమేష్‌రెడ్డి, ఏనుగుమర్రి మోపూరి రామకృష్ణ, మోపూరి రాంభూపాల్, అరిగెల శివశంకర్, మెట్టుపల్లి సుదర్శన్, గడ్డం ప్రసాద్‌రెడ్డి, నడిగడ్డ నాగేంద్ర, గొల్ల రామ్మోహన్‌యాదవ్, గుడిపాడు వెంకటరెడ్డి, పోతుదొడ్డి పుల్లారెడ్డి, కడితం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌కె.వలి, సీమ సుబ్బారెడ్డి, బర్మా శ్రీధర్, రామ్మోహన్, గండికోట రమేష్, పుల్లాసి శివ, పాల్గొన్నారు.

## కౌలు రైతులకు సులభంగా రుణాలు మంజూరు చేయాలి

**– జాయింట్ కలెక్టర్ బి.నవ్య**



పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న జెసి నవ్య

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** కౌలు రైతులకు సులభంగా రుణాలు మంజూరు చేయాలని, స్వయం సహాయక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి నవ్య పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 6వ జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాన్ని జెసి నవ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి నవ్య మాట్లాడుతూ జిల్లాలోని 43ప్రాథమిక సహకార సంఘాలు(ప్రాథమిక అగ్రికల్చర్ క్రెడిట్ కమిటీలు) కంప్యూటర్జేషన్ చేయడం జరిగిందని, డిస్టిక్ కోఆపరేటివ్ బ్యాంకులు కూడా ఇతర జాతీయ కమర్షియల్ బ్యాంకుల లాగా లావాదేవీలు, నియమాలు పాటిస్తూ ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నందున కొన్ని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను డిస్ట్రిక్ట్ కోపరేటివ్ బ్యాంకులకు ట్రాన్స్‌ఫర్ చేసే చర్యలు, కొత్తగా ఖాతాలు తెరిచే చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. జిల్లా లోని సిసిఆర్ కార్డులు కలిగిన రైతులకు సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వాలన్నారు. కోపరే టివ్ సొసైటీల నిర్మాణానికి రెవె న్యూ శాఖ స్థలం కేటాయించినప్పుడు జిల్లా పరిషత్ సిఈఓ, డ్వామా పిడిల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిఓ రామాంజనేయులు, డ్వామా పిడి వెంకట రమణయ్య, జిల్లా కోపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్, సిఈఓ రామాంజనేయులు, అగ్రికల్చర్ జెడి వరలక్ష్మి, మెప్మా పిడి నాగ శివలీల, డిఎం సివిల్ సప్లై నాగసుధా పాల్గొన్నారు.